ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5**
గురువారం 15 ఆగస్టు 2024



# సమస్యలకు నిలయాలు గురుకులాలు



లాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో డార్మెటరీ

- విద్యార్థులకు భద్రత కరువు
- అద్దె భవనాలతో అవస్థలు
- పడకలు లేక కొన్ని చోట్ల.. గదులు లేక మరికొన్ని చోట్ల
- అపరిశుభ్రంగా పరిసరాలు
- కోతులు, పాములు, పందులు, కుక్కల బెడద
- నిలిచిన బెడ్ షీట్లు, దుస్తులు, ట్రంక్ పెట్టెల పంపిణీ
- పత్తాలేని కాస్మాటిక్స్ చార్జీలు
- పక్కా భవనాలు నిర్మాణం.. ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే సమస్యలు పరిష్కారం



రాయికల్ మండలం అల్లీపూర్ గురుకుల పాఠశాలలో తలుపులు లేని మరుగుదొడ్లు

( ఆంధ్రజ్యోతి జగిత్యాల నెట్‌వర్క్)

జగిత్యాల జిల్లాలోని పలు గురుకుల పాఠశాలలు, కళా శాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. గురు కుల పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కరవైంది. అద్దె భవనా లతో గురుకుల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పడకలు లేక కొన్నిచోట్ల... గదులు లేక మరికొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.

పలు పాఠశాలల్లో కోతులు, పాములు, పందులు, కుక్కల బెడద ఎక్కువైంది. బెడ్ షీట్లు, దుస్తులు, ట్రంక్ పెట్టెల పంపిణీ నిలిచిపోయింది. బాలికల కాస్మోటిక్ చార్జీలు పత్తాలేకుండా పోయాయి. పక్కా భవనాలు నిర్మాణం.. ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెజార్టీ గురుకుల పాఠశాలలల్లో పరిశుభ్రత లోపించడం చెత్తా చెదారం, చెట్లు, పొదలతో నిండి ఉండడం, మురుగు నీరు నిల్వ ఉండడం, దోమల బెడద, ఆహారం నాణ్యత లోపించడం, కనీస సౌకర్యాలు లేకపోవడం, సొంత భవనాలు లేక పోవడం, ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, పిల్లోస్ అందించక పోవడం, ఇనుప బెడ్‌లపై పరుపుల కొరత, వేడి నీరు అందుబాటులో లేకపోవడం, సరిపడే విధంగా తరగతి గదులు, స్నానపు గదులు లేకపోవడం, కిచెన్ షెడ్స్ కొరత, తరగతి గదుల్లో బెంచీల కొరత వంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికి తోడు పలు పాఠశాలల్లో విష పురుగులు, పాముల సంచారం, కోతుల బెడద సైతం ఉన్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. పలు పాఠశాలల్లో తలుపులు, కిటికీలకు దోమ తెరలు లేకపోవడం వల్ల రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యార్థులు దోమ కాటుకు గురవుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. పలు పాఠశాలలకు ప్రహారీలు సైతం లేకపోవడం వల్ల పందులు, కుక్కలు, కోతులు ఆవరణలోకి వస్తున్నాయి. పాఠశాలల్లో క్రీడా సామగ్రి కొరత సైతం ఉంది.

జగిత్యాల జిల్లావ్యాప్తంగా 49 వివిధ గురుకుల పాఠశాలలు, కళాశాలలుండగా 20,376 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 14 కేజీ బీవీ పాఠశాలలు, రెండు మినీ గురుకుల పాఠశాలలు, ఐదు మైనార్టీ గురుకుల పాఠశాలలు, ఏడు బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, 13 టీఎస్ మోడల్ స్కూల్స్, ఐదు ఎస్సీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, రెండు టీఎస్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఒకటి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి విజిట్

- **జగిత్యాల పట్టణం**లోని కేజీబీవీ పాఠశాలలో దోమల బెడద ఎక్కువగా ఉంది. విద్యార్థులకు బెడ్ షీట్స్ అందించలేదు. గతేడాది ఇచ్చిన బెడ్ షీట్లను విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. భవాని నగర్‌లో గల తెలంగాణ స్టేట్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు పక్కా భవనం లేదు. నాలుగు భవనాలను అద్దెకు తీసుకొని కొనసాగిస్తున్నారు. డార్మెటరీ గది ఒక్కటి మాత్రమే ఉండడంతో విద్యార్థులు నేల పై పడుకుంటున్నారు. ఖిల్లాగడ్డలోని మైనారిటీ బాలుర పాఠశాల సమీపంలో అద్దెభవనం లో కొనసాగుతోంది. చారిత్రకఖిల్లా గోడలు, కందకం ఉండడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల సమీపంలో మురుగునీరు నిలిచే ప్రాంతాల్లో మొరం పోయించడం వంటి పనులు జరుగుతున్నా యి. జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో గల సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ గురుకుల కళాశాల అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. డైనింగ్ హాల్ లేక పోవడం, క్రీడామైదానం లేకపోవడం వంటి సమస్యలున్నాయి.
- **ధర్మపురి పట్టణం**లోని కేజీబీవీలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెడ్స్ లేకపోవడంతో నేలపై పడుకుంటున్నారు. బాత్‌రూమ్ వసతులు సైతం అంతంతమాత్రంగానే ఉన్నాయి. మైనారీటి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. పాఠశాలలో సైతం స్నానపు గదులు సరిపోవడం లేదు. మగ్గిడి గ్రామంలోని మోడల్ పాఠశాలలో శాశ్వత వంట గది లేకపోవడంతో ఆరు బయట వంట చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు.
- **మల్యాల** మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. పాఠశాల వసతులతోనే కళాశాలను సైతం నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్క బెడ్‌లోనే ఇద్దరు విద్యార్థులు నిద్రిస్తున్నారు. సుమారు 40 ఏళ్ల నాటి భవనం శిథిలం కాగా అందులోనే తరగతుల నిర్వహణ చేస్తున్నారు. అధ్యాపకుల కొరత, డార్మెటరీ లేక ఇక్కట్లు పడుతున్నారు.
- **మెట్‌పల్లి** పట్టణ శివారులో గల బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 539 మంది విద్యార్థినులు ఉన్నారు. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య పాఠశాల నిర్వహిస్తున్నారు. బెడ్స్ లేకపోవడంతో విద్యార్థులు నేలపై నిద్రిస్తున్నారు. బెడ్ షీట్స్, పిల్లోస్ అందించలేదు. రేకుల షెడ్డులో తరగతి బోధన జరుగుతోంది. డెస్కులు లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా సమయంలో కింద కూర్చోవడం వల్ల కాళ్లకు నొప్పులు వస్తున్నాయంటున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో బోరు నీటిని తాగుతున్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉంది. భోజనం చేసే సమయంలో కోతులు దాడులు చేస్తున్నాయి. తరచూ క్లాస్ రూమ్‌లోకి కోతులు వచ్చి గాయాలు చేస్తున్నాయి. పాఠశాలలో బిగించిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. క్రీడా మైదానం లేకపోవడం వల్ల ఆటలకు దూరమవుతున్నారు. మెస్ వద్ద ఉన్న డ్రైనేజీలో మురుగునీరు కంపు కొడుతోంది. విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.
- **పెగడపల్లి** మోడల్ స్కూల్‌లో ఇనుప బెడ్లు ఉన్నప్పటికీ బెడ్ షీట్లు, పిల్లోస్ అందించకపోవడంతో ఇంటినుంచి తెచ్చి వినియోగించుకుంటున్నారు. స్నానాలకు వేడి నీరు సరఫరా చేయకపోవడంతో చన్నీటి స్నానం చేస్తూ విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారంతో అపరి శుభ్రంగా ఉంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. కిటికీలు, తలుపులు దోమతెరలు లేవు. ఆహారం నాణ్యత లోపిస్తున్నట్లు విద్యార్థులు అంటున్నారు.
- **కొడిమ్యాల** మండలం సంద్రలపల్లిలో గల కేజీబీవీ పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. 208 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో సరిపోయే గదులు లేకపోవడంతో రాత్రివేళల్లో తరగతి గదుల్లోనే విద్యార్థులు నిద్రిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేవు. మూడు సంవత్సరాలుగా బెడ్ షీట్లు, పిల్లోస్ అందించడం లేదు. పలు గదుల తలుపులు, కిటికీలకు దోమ తెరలు లేవు. దీంతో విద్యార్థులు దోమకాటుకు గురై జ్వరాలబారిన పడుతున్నారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం లేదు. పాఠశాల సమీపంలో ఓ గుట్ట ఉండడం, చెట్లు ఎక్కువగా ఉండడంతో కోతుల బెడద అధికంగా ఉంది. విద్యార్థులు గదుల నుంచి బయటకు రావాలంటే కోతులతో జంకుతున్నారు.



కొడిమ్యాల మండలం సంద్రపల్లి కేజీబీవీలో కిటికీలు

- **కోరుట్ల మండలం** కల్లూరులో గల కేజీబీవీ పాఠశాలలో కోతుల బెడద, పాముల భయం ఉంది. కోరుట్ల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- **గొల్లపల్లి** కేజీబీవీలో విద్యార్థినులకు బెడ్స్ లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. బెడ్ షీట్స్, ట్రంకు పెట్టెల సరాఫరా లేదు. విద్యార్థులకు అవసరాలకు నీరు సరిపోక స్నానాలు చేయడం సైతం ఇబ్బందిగా ఉంది. గ్రామపంచాయతీ సరాఫరా చేసే నీటిపైనే విద్యార్థులు ఆదారపడుతున్నారు. వసతి గృహం చుట్టూ ఊర పందులు, కుక్కల బెడద అధి కంగా ఉంది. వసతి గృహం చుట్టు పక్కల ఆకతాయిల ఆగడాలు మితిమీరి పోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.
- **సారంగాపూర్** ఎస్సీ బాలుర వసతి గృహంలో ఇన్‌చార్జి వార్డెన్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో వసతి గృహంలో ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. స్టడీ అవర్స్ సమయంలో ఉపాధ్యాయులు ఉండడం లేదని విద్యార్థులు అంటు న్నారు. బెడ్ షీట్స్ పంపిణీ చేయలేదు.
- **బీర్‌పూర్** మండలంలోని చిత్రవేణి గూడెం ఆశ్రమ పాఠశాలలో కిటికీలు దోమ తెరలు లేకపోవడంతో బెడద ఎక్కువగా ఉంది. పాఠశాల ఆవరణలో అక్కడక్కడ పిచ్చి మొక్కలు, చెత్త పారవేసి ఉంది. మంగేళా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్, లైబ్రరీ గది లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది.
- **కథలాపూర్** మోడల్ స్కూల్ ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. చుట్టూ గడ్డి పొదలు ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. మురికి కాలువ లేకపోవడంతో నీరంతా ఆవరణలో నిలుస్తోంది.
- **వెల్గటూరు** మండలంలో గల కుమ్మరిపల్లి కేజీబీవీ, మోడల్ స్కూల్, స్తంభంపల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో పలు సమస్యలు తిష్టవేశాయి. బెడ్స్ ఉన్నప్పటికీ బెడ్ షీట్స్, పిల్లోస లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సోలార్ వాటర్ హీటర్ చెడిపోవడంతో వేడినీరు అందక చన్నీటి స్నానం చేస్తున్నారు. స్నానాల గదిలోనే బట్టలు ఉతుక్కుంటూ బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. కుమ్మరిపల్లి కేజీబీవీలో ఆరు సంవత్సరాలుగా బెడ్ షీట్స్, కార్పెట్లు, ట్రంక్ పెట్టెలు, రగ్గులు సరఫరా కాక పోవడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెడ్స్ లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. బాలికలకు ప్రతినెలా కాస్మోటిక్స్‌కు అందాల్సిన చార్జీలు ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.



కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌లో ఇరుకు గదిలో భోజనం చేస్తున్న విద్యార్థినులు



కథలాపూర్ మోడల్ స్కూల్ ఆవరణలో మురుగునీరు



మల్లాపూర్ మోడల్ స్కూల్‌లో ఏపుగా పెరిగిన చెట్ల పొదలు

### వేడి నీరు అందించడం లేదు

**కటుకం సాత్విక, పదో తరగతి, పెగడపల్లి మోడల్ స్కూల్**



పాఠశాలలో స్నానాలకు వేడి నీరు సరాఫరా చేయడం లేదు. ఫలితంగా ఉదయం పూట చన్నీటి స్నానాలు చేస్తున్నాము. దీని వల్ల పలు సందర్భాల్లో అస్వస్థతకు గురవుతున్నాము. స్నానాలకు వేడినీరు సరఫరా చేయాలి. అదేవిధంగా బెడ్ షీట్లు అందించాలి.

### సమస్యలు పరిష్కరించాలి

**సిద్ధిఖా ఫిర్‌దోస్, 9వ తరగతి, మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల, ధర్మపురి**



ధర్మపురి మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. స్నానాలు చేసేందుకు సైతం ఇబ్బందులకు గురవుతున్నాము. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

### టాయిలెట్స్ శుభ్రంగా లేవు

**ఏ. రాము, మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల స్తంభంపల్లి, వెల్గటూరు**



పాఠశాలలో టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. బెడ్స్ లేకపోవడంతో నేలపైన పడుకోవడానికి చాలా ఇబ్బంది ఉంది. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు.

### కోతుల బెడద ఎక్కువగా ఉంది

**కడారి మాధురి, 9వ తరగతి, సంద్రపల్లి కేజీబీవీ, కొడిమ్యాల**



పాఠశాలల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. చుట్టూ చెట్లు ఎక్కువగా ఉండడం, పాఠశాల సమీపంలో ఓ గుట్ట ఉండడం కారణంగా తరుచూ కోతులు గుంపులు, గుంపులుగా వస్తున్నాయి. దీంతో తరగతి గదులు, డార్మెంటరీ నుంచి బయటకు రావాలంటే జంకుతున్నాము.

## నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సుల్తానాబాద్, ఆగస్టు 14: ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి నాలుగు కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. సుల్తానాబాద్ చెరువు వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహ నంపై ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా నాలుగు గంజాయి ప్యాకెట్లు అభ్యమయ్యాయి. వాటిని కంటా వేయగా నాలుగు కిలోలుగా తేలింది. ఈ మేరకు అతడిని విచారించగా తన పేరు బద్దిపడిగె సంజీవ రెడ్డి అని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మం డలంలోని ఎర్కలగూడెం (లింగాపూర్) గ్రామమని ఒప్పుకున్నాడు. ఈ గంజాయిని తన బావ ఒడిశాలో ఉంటున్న రాజారాం ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 13న హుజూరాబాద్‌లో తనకు అందజేశారని చెప్పాడు. బావ ఆదేశం మేరకు ఆ గంజాయిని గోదావరిఖనిలో అప్పగించేందుకు బుధవారం స్వగ్రామం నుంచి బయలు దేరానని తెలిపాడు. సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయితో సహా బైక్‌ను కూడా సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

## జమ్మికుంటలో నిత్య జనగణమన

● ఏడేళ్లుగా కొనసాగుతున్న జాతీయ గీతాలాపన
● ఉత్సాహంగా పాల్గొంటున్న ప్రజలు



జమ్మికుంటలో జాతీయగీతం ఆలపిస్తున్న ప్రజలు (ఫైల్)

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14: జమ్మికుంటలో నిత్య జనగణమన జాతీయగీతం ప్రారంభమై ఏడేళ్లు కావస్తోంది. ప్రతి రోజు జాతీయగీతం ఆలాపన పూర్తి అయిన తర్వాతే ప్రజలు తమ తమ పనుల్లో నిమగ్నం అవుతున్నారు. నిత్య జాతీయగీతం ఆలాపన కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాలు సైతం స్ఫూర్తిగా తీసుకొని ఆయా ప్రాంతాల్లో ప్రారంభించారు. జమ్మికుంట పట్టణంలో 2017 ఆగస్టు 15న నిత్య జనగణమన కార్యక్రమాన్ని అప్పటి సీఐ పింగిలి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. గాంధీ చౌరస్తా, మోత్కుల గూడెం చౌరస్తా, సంపత్ పాన్‌షాప్, పాత సిటికేబుల్ వీధి, కొత్తపల్లి, ఆర్టీసీ బస్టాండ్, మడిపల్లి క్రాస్‌రోడ్, ఐబీపీ పెట్రోల్ బంక్, మురళీ థియేటర్, కూరగాయల మార్కెట్, మున్సిపల్ కార్యాల యం, ప్రభుత్వ డిగ్రీ కళాశా ల మైదానం, గణేశ్‌నగర్, రైల్వే స్టేషన్, పంచముఖ హనుమాన్ ఆలయం సమీ పంలో మొత్తం 17ప్రధాన కూడళ్లలో మైకులు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 7.30గంటలకు దేశభక్తి గీతాలు ప్రారంభించి, సరిగ్గా 8 గంటలకు జాతీయగీతం ప్రారంభి స్తారు. దీంతో ఎక్కడి వారు అక్కడే నిలబడి జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది ఇక్కడకు వచ్చి జాతీయగీతం ఆలా పన కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి ఆకర్షితులయ్యారు. హరియాణా రాష్ట్రంలో ఫరిదా బాద్ జిల్లా మణక్‌పూర్ గ్రామం, పంజాబ్, జమ్మికుంట మండలం నాగంపేట, ధర్మారం, కోరుట్ల, మెట్ పల్లి, గోదావరిఖని, లక్షట్ పేట, జగిత్యాల జిల్లా మెడిపల్లి, ప్రాంతాల్లో జమ్మికుంటను ఆదర్శంగా తీసుకొని నిత్య జనగణ మన జాతీయ గీతాన్ని ఆలపించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 21 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

గణేశ్‌నగర్, ఆగస్టు 14 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.

## ఢిల్లీ వేడుకలకు పెద్దపల్లి జిల్లా విద్యార్థులు..



మహ్మద్ అల్ రిషన్



అభిగ్న

ఓదెల, పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 14 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లా విద్యార్థులకు ఆహ్వానం అం దింది. ఓదెల మండలంలోని ఓదెల మోడల్ హైస్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.అభిగ్న, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.సుజాత వేడుక లకు హాజరుకానున్నారు. అలాగే పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి మహ్మద్ అల్ రిషన్‌కు వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందించి. విద్యార్థులకు ఆహ్వానం రావడంపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# అపహరించి.. అమ్ముకోవాలనుకున్నాడు..

బాలుడి కిడ్నాప్ డీల్ రూ. 1.30 లక్షలు

● మధ్యవర్తితో కుదిరిన బేరం
● నిందితుడికి గతంలో నేర చరిత్ర
● 18 గంటల్లో కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు



మెట్‌పల్లిలో నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అశోక్ కుమార్

మెట్‌పల్లి, ఆగస్టు 14(ఇబ్రహీంపట్నం): చిన్నచిన్న దొంగతనాలు చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడిన దొంగ ఒక్కసారిగా ఎదగాలనుకున్నాడో ఏమో గాని ఏకంగా బాలుడిని అమ్ముకోవడానికి 1.30 లక్షలకు బేరం కుదుర్చుకొని రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి పోలీస్‌లకు దొరికి కటకటాల పాలయ్యాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడ లో మంగళవారం బాలుడు కిడ్నాప్ అయ్యాడు. పోలీసులు 18 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించారు. బాలుడి కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను ఎస్పీ అశోక్‌కుమార్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. పట్టణంలోని దుబ్బ వాడలో ఈ నెల 13న తన అక్కతో కలిసి కిరాణ కొట్టుకు వెళ్లిన శివ అనే రెండేళ్ల బాలుడి ని గుర్తు తెలయని వ్యక్తి కిడ్నాప్ చేయగా బాలుడి తల్లి దండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా రాత్రి నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తుండగా బుధవా రం మధ్యాహ్నం వెంకట్రావ్‌పేట శివారులో జాతీయ రహదారిపై బైక్‌పై బాలుడిని నిందితుడు తీసుకెళ్తున్నట్టు గమనించి వెంబడించి పట్టుకు న్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బాలుడి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బాలుడిని సురక్షితంగా పట్టుకుని పోలీస్‌లు తల్లిదం డ్రులకు అప్పగించడంతో పోలీస్‌లకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతాలు తెలిపా రు. జల్సాలకు అలవాటు పడిన ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడని ఎస్పీ తెలిపారు. నాగేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. బాలుడి కిడ్నాప్ కేసును 18 గంటల్లోనే ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

● **పక్కా ప్లాన్‌తో కిడ్నాప్...:** డబ్బు ఎలాగైన సంపాదించాలనే ఆశతో నాగేష్ పక్క ప్లాన్‌గా బాలుడ్ని కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగేష్ మొదటి నుంచి నేర చరిత్ర కలిగినవాడేనని గతంలో పసుపు దొంగతనం, బైక్‌లు, గొర్లతో పాటు పలు దొంగతనాలకు పాల్పడి నట్లు తెలుస్తోంది. నాగేష్ వ్యవహార శైలిపై విసుగు చెందిన అతడి భార్య గొడవ పెట్టుకుని కూతురుతో కలిసి నాగేష్‌కు దూరంగా ఉంటోంది. కాగ మంగళవారం సాయంత్రం కిడ్నాప్ చేసిన బాలుడిని పట్టణ శివారులోని అర్బన్ కాలనీ, అమ్మక్కపేట గ్రామానికి సమీపంలో ఉన్న కాలనీలో దాచి పెట్టిన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో తాను పసుపు దొంగతనం చేసి ఉంచిన ఇంటిలోనే బాలుడిని దాచినట్లు సమాచారం. బాలుడిని అమ్మేం దుకు అదే కాలనీకి చెందిన ఓ మహిళ మధ్యవర్తిత్వం వహించి 1.30 లక్షలకు డీల్ కుదిర్చినట్లు తెలుస్తోంది. పక్కా సమాచారంతో పోలీస్‌లు అక్కడికి వెళ్లగా సమాచారం తెలుసుకున్న నాగేష్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీనితో వెంబడించి బాలుడిని పట్టుకున్నట్లు సమాచారం. గతంలోనే నాగేష్‌పై రెండు పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు ఉన్నట్లు తెలిసింది. నిందితుడు బాలుడిని అమ్మేందుకు కోరుట్లకు చెందిన వారితో డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

# నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు

● మూడు కేసుల్లో తీర్పులు
● ఒకరికి జీవిత ఖైదు, మరొకరికి ఏడేళ్ల జైలు
● మరో రెండు కేసుల్లో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష
● సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, ఆగస్టు 14: నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు కేసుల్లో తీర్పులు వెల్లడయ్యాయని, ఈ కేసుల్లో నిందితులైన కొడుకుకు జీవిత ఖైదు, తండ్రికి ఏడేళ్ల జైలు శిక్ష, మరో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధించార న్నారు. వేములవాడ రూరల్ మండలంలోని వటెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డికి జీవిత ఖైదు, రూ. 5వేల జరిమానా, మరో నిందితు డైన బారాజు నర్సింహారెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ 3 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తీర్పు ఇచ్చారన్నా రు. వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, ఎమి రెడ్డి రాంరెడ్డి, కనకరెడ్డి, లచ్చిరెడ్డిల మధ్య చాలాకాలంగా భూ తగాదాలు ఉన్నాయన్నారు. మే 25, 2015న దాడుల్లో ఎమిరెడ్డి రాంరెడ్డికి తీవ్రగాయా లై చికిత్సకోసం తరలిస్తుండగా మృతిచెందాడన్నారు. దాడి చేసి రాంరెడ్డి మృతికి కారకులైన తండ్రి కొడుకులైన బారాజు మల్లారెడ్డి, నర్సింహా రెడ్డి లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఈ కేసులో అప్పటి సీఐ శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా పిపి నర్సింగరావు కేసు వాదించగా 17మంది సాక్షుల ను కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, రమేశ్‌లు కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వ పరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధించారన్నారు.

● ఓ హత్యాయత్నం కేసులో కోనరావుపేట మండ లంలోని ధర్మారం గ్రామానికి చెందిన గంగుల రమేశ్ అనే నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ. 1100 జరిమానా విధి స్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారన్నారు. 2018లో కాళేశ్వరం ప్రాజెక్టు పనిలో భాగంగా టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసే రమేశ్‌ను విధుల నుంచి తొలగించారని, ఇది మనసులో పెట్టుకొని రమేశ్ ప్రాజెక్టు మేనేజర్ చేకూరి కృష్ణంరాజుపై హత్యాయత్నం చేశాడన్నారు. ఈ కేసులో అప్పటి సీఐ పర్శరాములు నిందితుడు రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. ఈ కేసులో పిపి వేముల లక్ష్మి ప్రసాద్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ లతీఫ్ 10మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి రాధి క జైస్వాల్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ. 1100 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఆయన తెలిపారు.

● సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన కావలి లక్ష్మిపై తన భర్త కావలి రాజు కిరోసిన్ పోసి హత్యయత్నానికి పాల్పడ్డాడని, ఈ కేసులో భర్త రాజుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధి స్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు ఇచ్చారన్నారు. సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించు కోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయవిచారణ, నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారన్నారు. మూడు కేసులలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన పీపీలు వేముల లక్ష్మి ప్రసాద్, నర్సింగరావులను, సీఎంఎస్ ఎస్ఐ రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుళ్ల రమేశ్, మహేందర్, లతీఫ్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, నరేందర్‌లను ఎస్పీ అభినందించారు.

## వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి గౌరయ్య బుధవారం అదృశ్యమయ్యాడని కుటుంబీకులు, స్థానికులు తెలిపారు. గౌరయ్య తన భార్య ఇటీవల మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాడని పేర్కొన్నారు. కొడుకులకు వేరుగా వేరుగా నివసిస్తున్నారు. బుధవారం వేకువజామున తాను ఉంటున్న ఇంటికి తాళం వేసి గౌరయ్య బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వారు, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని కుటుంబ సభ్యులు వివరించారు.

## 14 మందిపై కేసు నమోదు

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని జయ్యారం గ్రామశివారులోని అంకమెట్టుగుట్ట వద్ద డబ్బులు పెట్టుకొని చిత్తుబొత్తు ఆడుతున్న 14 మందిని బుధవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. 14 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 75,800 నగదును, 14 సెల్‌ఫోన్లు, 6 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 14: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు 3,598 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.34 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మధ్యమానేరు నుంచి 6,400 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

**జగిత్యాల:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను బుధవారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 4,303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.847 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా పాశం తిరుపతి నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ రూరల్, ఆగస్టు 14: సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పాశం తిరుపతిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు నియామక పత్రాన్ని బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొరటాల శివరామకృష్ణయ్య, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ బాలిక మృతి

ముత్తారం, ఆగస్టు 14: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధి రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి ప్రసన్న (17) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో బాలిక మృతిచెందింది. ఈనెల 10న జ్వరంతో ప్రసన్న తండ్రి నారాయణ ఖమ్మంపల్లికి చెందిన ఓ ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. అయినా జ్వరం ఎక్కువ కావడంతో హైదరాబాద్‌కు తరలించగా బుధవారం ఉదయం మృతి చెందింది. కాగా, ఖమ్మంపల్లిలోని ఆర్‌ఎంపీ ఇచ్చిన అధిక డోస్ ఇంజక్షన్ వికటించడం వల్లనే తమ కూతురి పరిస్థితి విషమించిందని హైదరాబాద్‌లోని వైద్యులు పేర్కొన్నారని బాలిక తల్లిదండ్రులకు ఆరోపిస్తున్నారు. బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు తన ఇంటి ఎదుట ఆందోళన చేసే అవకాశం ఉందని భావించిన సదరు ఆర్‌ఎంపీ రామగుండం సీపీని ఆశ్రయించాడు. ఈ మేరకు సీపీ ఆదేశాలతో రామగిరి ఎస్సై బాలిక మృతదేహాన్ని తీసుకవస్తున్న అంబులెన్స్‌ను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

దేవాదాయశాఖ అదనపు కమిషనర్ సుప్రియ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుప్రియ

కరీంనగర్ కల్చరల్ ఆగష్టు 14: ఉత్తమ సేవల తోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్(ఏసీ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఆమె గత ఏసీ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్యలున్నా కార్యాలయంలో సంప్రదిస్తే పరిష్క రించేందుకు కృషి చేస్తానని అన్నారు. మెదక్ జిల్లా ఏసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఉద్యోగులు చక్కని సహకారం అందించారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, పెద్దపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఈఓలు కందుల సుధాకర్, సదయ్య, నాగుల అనిల్‌కుమార్, ఎండపెల్లి మారుతి, కొస్న కాంతారెడ్డి, వుడుతల వెంకన్న, నాగారపు శ్రీనివాస్, డివి మారుతిరావు, ముద్దసాని శంకరయ్య, ముద్దం విక్రమ్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



ఇమామ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఆగస్ట 14 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కాష్‌పల్లి వద్ద రోడ్డుపై వీర్నపల్లికి చెందిన సయ్యద్ ఇమామ్(55) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. వీర్నపల్లికి చెందిన ఇమామ్ కూలి చేసుకుంటూ జీవించేవాడు. ఎల్లారెడ్డిపేటలో ఉంటున్న తన కొడుకు వద్దకు ఇమామ్ ద్విచక్ర వాహనంపై మంగళవారం వెళ్లి అదే రోజు తిరిగి వీర్నపల్లికి వెళతున్నాని చెప్పి అక్కడి నుంచి బయలు దేరాడు. మరుసటి రోజు తుర్కాష్‌పల్లి వద్ద ఇమామ్ రోడ్డుపై అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. రోడ్డుపై ఇమామ్ మృతి చెంది ఉండటంతో పోలీస్‌లు వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులు అక్కడికి చేరుకున్నారు. ముఖానికి తీవ్ర గాయాలై తలపగిలి ఇమామ్ మృతి చెంది ఉన్నాడని, మృతిపై అనుమానాలు ఉన్నాయని వారు ఆరోపించారు.వాహనం కూడా సంఘటన స్థలం వద్ద లేదని మృతుడి కొడుకు భాష పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పూర్తి స్థాయిలో విచారణ చేసి, తన తండ్రి మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఎస్ఐ రాంమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14: మండలంలోని గంద్రపల్లిలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 16.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన చింతల ప్రసాద్ ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా, అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌లు తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

## సంక్షిప్త సమాచారం..

**జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):** న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పోస్టర్లను పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**బీర్‌పూర్:** ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ఏ శ్రీనివాస్ బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఏ శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చి బీర్‌పూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

**జగిత్యాల అర్బన్:** జగిత్యాల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బోగోజి ముఖేష్ ఖన్నా ఆధ్వర్యంలో చేపట్టిన వయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ బాధ్యులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆయా విభాగాల బాధ్యులు సిరాజుద్దీన్ మన్సూర్, రాజేందర్, రామ్ ప్రకాష్, కుమార్, షాకీర్ తదితరులు ఉన్నారు.

- తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తల్లితండ్రులే మా ప్రత్యక్ష దేవతలు- వారి సంరక్షణ మా బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సంఘ బాధ్యులు విశ్వనాథం, విజయ్, హన్మంతు, యాకుబ్, ప్రకాష్, సతీష్, కిషన్, గంగాధర్ ఉన్నారు.

**జగిత్యాలరూరల్:** పరిసరాల్లో, ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా మాతాశిశుసంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని టీఆర్‌నగర్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతాప్‌సింగ్ అనే వ్యక్తికి డెంగీ వ్యాధి సోకగా బాధితుడి ఇంటివద్దకు వెళ్లి జాగ్రత్తలను వివరించి జిల్లా మాతాశిశుసంరక్షణ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు.

**రాయికల్:** మొక్కలు పెంచి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని జగిత్యాల ఎలక్ట్రికల్ డీఈ రాజరెడ్డి అన్నారు. మండలంలోని వీరాపూర్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ గన్నె మల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు.

- రాయికల్ మండలంలోని కొత్తపేటలో కాంగ్రెస్ నాయకుడు రాజ్‌కుమార్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు.

- జగిత్యాల జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన న్యాయవాది అల్లె పురుషోత్తంను కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు శాలువాతో ఘనంగా సన్మానించారు.

- రాయికల్ మండలంలోని కైరిగూడెం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన భీంరెడ్డి అనే వ్యక్తికి ఇంటి నంబర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించడానికి పంచాయతీ కార్యదర్శి రూ.30 వేలు లంచం తీసుకున్నాడని, రిజిస్ట్రేషన్ చేయించలేదని అడుగగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. కార్యదర్శిని సస్పెండ్ చేసి డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు.

**గొల్లపల్లి:** చేప పిల్లల పంపిణీని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కోమల్ల జలందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ సంక్షేమ సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.

- మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీపీఎం వెంకటేష్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం పాడి గేదెలు, ఆవులు, పెరటి కోళ్ల పెంపకంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**కొడిమ్యాల:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ బుధవారం జగిత్యాల ఆర్డీవో మధుసూధన్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

- కొడిమ్యాల మండలంలోని పూడూర్, కొండాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో స్వరూప పారిశుధ్య పనులను పరిశీలించారు.

- కొడిమ్యాల మండలంలోని పూడూర్ సింగిల్ విండో పరిధిలోని తిప్పయ్యపల్లి గ్రామంలో నిర్మిస్తున్న గోదాం కార్యవర్గ సభ్యుల తీర్మానం మేరకు నిర్మిస్తున్నామని చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి జిల్లా సహకార అధికారికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. అనంతరం పూడూర్ సింగిల్ విండో కార్యాలయం ఎదుట మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండటానికి మెజార్టీ కార్యవర్గ సభ్యుల ఆమోదం మేరకే పనులను చేపట్టినట్లు తెలిపారు.

**ధర్మపురి:** ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా చీపిరిశెట్టి రాజేష్‌ను నియమించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయనకు నియామకపు పత్రాన్ని అందించారు.

**మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం):** పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో బుధవారం విభజన గాయాల స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాసించిన వక్తలను నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పూలమాలలు, శాలువతో సత్కారించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి యాదగిరి బాబు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని వర్షకొండ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ వెంకట్ ఉచితంగా టై, బెల్ట్, ఐడీ కార్డులను 200 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో అందజేశారు.

**కోరుట్ల:** బీడీ కార్మికులు, ప్యాకర్లకు చేయూత పథకం కింద నాలుగు వేల జీవన భృతి అందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసం నరేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు.

- కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా వెంకటేశ్వర్లు హాజరై అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

**మల్లాపూర్:** మండలంలోని సిర్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నల్ల బాపురెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరి ఫైర్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు.

- గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని మండల వైద్యాధికారి వాహిని సూచించారు. మండలంలోని సిర్పూర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య పరిక్షలు చేశారు. 10మందికి జ్వరం ఉన్నట్టు గుర్తించి రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

**కథలాపూర్:** పెరటి కోళ్ల, పాడి పశువుల పెంపకంపై మహిళలకు స్త్రీశక్తి భవనంలో అవగాహన కల్పించారు. మహిళలు పాడి పశువులను పెంచుకుంటే ఆదాయ మార్గాలు పెరుగుతాయని వెటర్నరీ వైద్యులు అంకం శ్రీనివాస్, దివ్య సూచించారు.

- కథలాపూర్ మండలంలోని తుర్తికి చెందిన జాప నడిపి మల్లేశం అనే వ్యక్తికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు. 1.25 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు.



# స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



విద్యుత్‌దీపాల వెలుగుల్లో కలెక్టరేట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్

### - పోలీస్ గ్రౌండ్‌లో పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో, పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. ధరూర్ క్యాంపులో గల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ జాతీయ పతాకావిష్కరణ జరుపనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్, వందన స్వీకారం, ముఖ్య అతిథి సందేశం, స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం, వివిధ రంగాల్లో కృషి చేసిన వ్యక్తులకు ప్రశంసాపత్రాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వందన సమర్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సందర్శిస్తారు. అదేవిధంగా సాయంత్రం సమయంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ సత్యప్రసాద్, కలెక్టర్ అశోక్ కుమార్ తదితరులు పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇదిలాఉండగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్ జాతీయ పతాకావిష్కరణ జరపడానికి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**● వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలి**

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో పతాకావిష్కరణ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిచే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రగతి నివేదిక సందేశం ఉన్నందున విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యేలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 14: పట్టణంలోని పొన్నాల గార్డెన్‌లో పట్టణ మరియు అర్బన్ మండలానికి చెందిన 243 లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.80లక్షల 52వేల విలువగల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ పేదల పాలిట వరమన్నారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువా ల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు పాల్గొన్నారు.

**కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని 41 మంది లబ్ధిదారలకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. 41 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ. 5,36,400 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాగులపేట మాజీ సర్పంచ్ బాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఫహీం, అజయ్, అన్వర్, మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**మల్లాపూర్:** మండలంలోని రాఘవపేట, నడికుడ, మొగిలిపేట, ఓబులాపూర్, సంగేం్శ్రీరాంపూర్, కొత్తదాం రాజ్‌పల్లి, పాతధాంరాజ్‌పల్లి, వాల్గొండ గ్రామాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు కోరట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆయన నేరుగా వారి వద్దకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గ్రామాల్లోని నరసరాలను పర్యటించి పారిశుధ్యం పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముందస్తు రాఖీ వేడుకలు

ధర్మపురి, ఆగస్టు 14: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏజీపీ రౌతు రాజేష్, న్యాయవాదులు రామడుగు రాజేష్, జూజుల రమేష్, గూడ జితేందర్‌రెడ్డి, బత్తిని ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

బుగ్గారం ఆగస్టు 14: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం 30 లక్షల విలువ గల 130 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గానికి రెండు వేల చెక్కులను మంజూరు చేయించానన్నారు. ఈ విడతలో చెక్కులు రానివారు బాధపడాల్సిన అవసరం లేదని మరో విడతలో అందజేస్తామన్నారు. ఎవరికి ఎటువంటి అవసరం ఉన్న నేరుగా తనని కలవాలని సూచించారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చుస్తామని అన్నారు. అనంతరం శెకల్లలో ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, మాజీ జడ్పీటీసీ బాదినేని రాజేందర్, మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్స గౌడ్, నాయకులు జంగ శ్రీనివాస్, సిగిరి అంజిత్ కుమార్, బీరుపురి తిరుపతి పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం

**● కొండగట్టు ఆలయ పరిధిలో కార్యకలాపాల పర్యవేక్షణ ● ఈవో రామకృష్ణరావు**

మల్యాల, ఆగస్టు 14: కొండగట్టు దేవస్థానం పరిధిలో గల సీసీ కెమెరాలను దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానానికి అనుసంధానం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అనుసంధానంతో దేవస్థానం పరిధిలో ఉద్యోగ, సిబ్బంది పనితీరు, భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా కమిషనర్ కార్యాలయ అధికారులు పరిశీలించవచ్చు. ఇప్పటికే యాదాద్రి తదితర ప్రధాన ఆలయాల్లోని సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. దీంతో ఇటీవల నూతనంగా ఈవోగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణరావు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్నాళ్లు కమిషనర్ కార్యాలయంలో ఆర్‌జేసీ స్థాయి అధికారిగా విధులు నిర్వహించడం, యాదాద్రిలోనూ ఈవోగా పనిచేసిన నేపథ్యంలో కొండగట్టులో గల 64 సీసీ కెమెరాలను అనుసంధానం చేసేందుకు నిర్ణయించారు. నేరాల అదుపు కోసం ఇప్పటికే హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు ఇక్కడి సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. తాజాగా భక్తులు, ఉద్యోగుల విధులు తదితరవి పర్యవేక్షణకు కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కమిషనర్ ఇతర ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షించడానికి దోహదపడుతుందన్నారు. కాగా ఈవో బాధ్యతలు చేపట్టాక తన సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని ఈవో తెలిపారు.

# బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్‌హాల్ నుంచి టవర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి, జాతీయ సమైక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, చీటి చంద్రశేఖర్, ఆన్‌కార్ సుధాకర్, భగవంతరావు, ఠాకూర్ కిషోర్‌సింగ్, విద్యాఠాకూర్, బడే శంకర్ పాల్గొన్నారు.

**ఎండపల్లి:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఎండపల్లి మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి రాజారాంపల్లి పీఎస్ఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు, జక్కుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాలరూరల్, ఆగస్టు 14: వసతి గృహల్లో జరుగుతున్న సంఘటలనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ డిమాండ్ చేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు విద్యార్థులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు.

## అవార్డు అందుకున్న మెప్మా బృందం

మెట్‌పల్లి, ఆగస్టు 14(ఇబ్రహీంపట్నం): శ్రీనిధి రుణాల్లో లక్ష్యాలను సాధించి అన్ని మున్సిపాలిటీల కంటే రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన మెట్‌పల్లి మున్సిపాల్ మెప్మా బృందం బుధవారం మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శ్రీనిధి రుణాలు అందిస్తూ మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు స్వయం ఉపాధి పొందటంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు మంత్రి సీతక్క చేతుల మీదుగా మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, టీఎంసీ సోమిడి శివకుమార్, మహిళ సమైక్య అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మి అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న మెప్మా బృందంను పలువురు అభినందించారు.

## క్రీడలతో మానసికోల్లాసం

మెట్‌పల్లి , ఆగస్టు 14(ఇబ్రహీంపట్నం): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం ఏర్పడుతుందని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కంచె ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను జడ్జి ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు వెంకట నర్సయ్య, హరి భూషణ్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ విలువ ఇప్పించాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 14: మండలంలోని గ్రామాల మీదుగా నేషనల్ హైవే 63 భూ సేకరణలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ విలువతో నష్టపరిహారం ఇప్పించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కోరారు. బుధవారం మండలంలోని మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయేతర బాధితులు కలిసి ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఎంపీ స్పందన లేకపోవడంతో బాధితులు నిరసన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది గ్రామాల్లోని బాధితులు ఉన్నారు.

# కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసిన ఎంపీ అర్వింద్





కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, ఆర్యవైశ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బుధవారం కలిశారు. కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడారు. ఇటీవల జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశా లలో జరిగిన రెండు విషాద ఘటనలను వివరించా రు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిదంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పలు పెండింగ్ సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పట్టణంలోని ధరూర్ క్యాంపులో గల సీ టైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నిరుపేదల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణిప్రవీణ్ ఉన్నారు.

**● ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కృషి**

ఆర్యవైశ్యుల సంక్షేమానికి అవసరమైన ప్రత్యేక కృషి చేస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం పట్టణంలోని టవర్ సర్కిల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య సంఘ భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందన్నారు.

● జగిత్యాలలో ఆర్యవైశ్య సంఘ భవనాన్ని అన్ని వర్గాల కృషితో పూర్తి చేసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ అన్నారు. గతంలో ఎంతో మంది రాజకీయ సభలకు కేంద్రంగా ఉన్న వైశ్య భవన్‌ను పునరుద్ధరించుకోవడం సంతోషకరమన్నారు.

● ఆర్యవైశ్యులు తలచుకుంటే ఏదైనా సాధిస్తారని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి, సంఘ అభివృద్ధికి అవసరమైన తన వంతు సహకారాలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు ఎడవల్లి సురేశ్, పట్టణాధ్యక్షుడు మంచాల కృష్ణ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయికల్, ఆగస్టు 14: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని ఆరో వార్డు మత్తడి వాడలో జ్వరాలు వ్యాపిస్తున్నందున మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి పారిశుధ్య పనులను చేయించారు. వార్డులోని మురికి కాలువల్లో చెత్తాచెదారం తొలగించి దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అలాగే జ్వర బాధితుల వివరాలను ఆశా వర్కర్లతో నమోదు చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది అత్యవసరంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్వరీ బేగం, తురగ శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ వెంకటి, బస్తీ దవాఖానా వైద్యుడు సాబిర్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైతు మృతి



భీమయ్య(ఫైల్)

మేడిపల్లి, అగస్టు 14: మండల కేంద్రానికి చెందిన వేముల వాడ భీమయ్య(65) అనే రైతు ప్రమాదవశాత్తు బుధవారం మృతి చెందాడు. భీమయ్య అనే రైతు కాకతీ య కాలువ కింద నుంచి వరదనీరు పోవడానికి ఏర్పాటు చేసిన యూటీకి కరెంటు మోటారును అమర్చుకొని పొలం సాగుచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలానికి నీరు పెట్టడానికి భీమయ్య మోటరు వద్దకు వెళ్లాడు. మోటరు పంపులో నీరులేకపోడంతో బిందెకు తాడుకట్టి అదే యూటిలోంచి తోడుతుండగా ప్రమాదవశాత్తు జారి అందులో పడిపోయాడు. భీమయ్యకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ ఇంతియాజ్ తెలిపారు.

## స్టోన్ క్రషర్‌లో కూలిన బండ

ఎండపల్లి, ఆగస్టు 14: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన ఓ స్టోన్ క్రెషర్‌లో ప్రమాదం జరిగింది. సూర్య స్టోన్ క్రషర్‌లో గుట్టపై బండ వెలికితీత పనులు నడుస్తున్నాయి. గుట్టపై ప్రొక్లెయిన్‌తో జార్ఖండ్‌కి చెందిన కుంధాన్(25) అనే వ్యక్తి పనులు చేస్తున్నాడు. బండ వెలికితీత పనుల్లో భాగంగా బండ పక్కకి ఉన్న మట్టి తీస్తుండగా పెద్దబండ వచ్చి ప్రొక్లెయిన్‌పై పడింది. గుట్టపై నుంచి ప్రొక్లెయిన్ కింద పడడంతో దానిపై పెద్ద పెద్ద బండలు పడ్డాయి. అందులో డ్రైవర్ ఉండి ఉంటాడని సూపర్‌వైజర్ తెలిపాడు. ప్రొక్లెయిన్ తీయడానికి పోలీసులు కృషి చేస్తున్నారు.

## జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎంపీ

**జగిత్యాల అర్బన్:** తాను బీజేపీలో చేరిన నాటినుంచి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల డిమాండ్ వింటూ వస్తున్నదేనని, సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో వ్యక్తిగతంగా మాట్లాడుతానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్ష 12వ రోజుకు చేరుకోగా దీక్షకు ఎంపీ అర్వింద్ సంఘీభావం తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నాయకులు కృష్ణహరి, దశరథ రెడ్డి, నలువాల తిరుపతి, మదన్‌మోహన్, రంగు గోపాల్, గోసేవా జిల్లా అధ్యక్షుడు కట్ట శివ ఉన్నారు.

## ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

### - 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోరుట్ల రూరల్, ఆగస్టు 14: 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా, కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్' అన్న 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన లభించింది. కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్‌కుమార్ ఆదేశాలతో తహసీల్దార్ కిషన్ ప్రరవేక్షణలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక టీంలుగా ఏర్పడి నాగులపేటతో పాటు కోరుట్ల పట్టణంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. నాగులపేటలో నిలువ ఉన్న 150 ఇసుక కుప్పలను సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఆర్ఐ రాజేందర్ రావుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయినబాలిక

### - తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 14: జగిత్యాల పట్టణ బస్టాండ్‌లో ఓ బాలిక తల్లితండ్రుల వద్ద నుంచి తప్పిపోయింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు బాలికను జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. వారి తల్లితండ్రులకు సమాచారం చేరవేసేవిధంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన ద్వారా బాలిక ఆచూకీ తెలుసుకున్న బాలిక తల్లిందండ్రులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా పట్టణ పోలీసులు బాలికను క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్బంగా బాలిక తల్లిదండ్రులు సీఐ వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం

కథలాపూర్, ఆగస్టు 14: మండల కేంద్రంలో సీతారాముల కళ్యాణోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా గుంటి పెరమాళ్ల సన్నిధానం పక్కన విగ్రహ ప్రతిష్ఠాన కార్యక్రమాలు కొనసాగుతుండగా బుధవారంతో ముగిసాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.